ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4
***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 28 జూలై 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.60 (124.3222)	53,795	6,112
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (3.80)	1,002	353
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.04 (1.04)	69	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



ప్రాజెక్టులు నిండి కాల్వలకు నీటిని విడుదలచేస్తే వాటి నిర్వహణలో లష్కర్లది కీలక భూమిక. కాల్వల వెంట తిరుగుతూ ఎక్కడ గండిపడినా అధికారులకు సమాచారం ఇవ్వడం, నీటి చౌర్యం జరగకుండా అడ్డుకోవడం వీరి విధి. నీటి విడుదలకు ముందే ఎక్కడెక్కడ కట్టలు బలహీనంగా ఉన్నాయో గుర్తించి అధికారులను వీరు అప్రమత్తం చేస్తుంటారు. ఇంతటి కీలక విధులు నిర్వహించే లష్కర్ల పోస్టుల భర్తీని ప్రభుత్వాలు ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లేక కాల్వలు బలహీనంగా మారాయి.
- నల్లగొండ

లష్కర్లు ఏరీ?

- చెరువుల పర్యవేక్షణ, నీటి విడుదలకు సిబ్బంది కొరత
- జలాశయాలకు గండిపడితే చూసే వారు కరువు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని అధికారులు
- భారీ వర్షాలు వస్తే జలాశయాలకు పొంచివున్న ముప్పు

కృష్ణానది ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో వరద ప్రభావం మొదలైంది. ప్రవాహం ఇలాగే కొనసాగి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగితే కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది. సాగర్ నిండితే ఆయకట్టులోని పలు చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేస్తారు. ఏఎమ్మార్పీ కింద ఉన్న చెరువులకు కూడా కృష్ణ జలాలు చేరుతాయి. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు నీరు చేరడంతో పాటు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కూడా చేశారు. డిండి ప్రాజెక్టుకు సైతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురిసే వర్షాలతో రానున్న రోజుల్లో వరద వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం కింద పలు చెరువులను పునరుద్ధరించారు. దీంతో కొన్ని చెరువులు పటిష్ఠంగా అయినా, మరికొన్ని చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ నుంచి నీటి సంవత్సరం మొదలైనా, ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతోజలాశయాల్లో నీరు చేరలేదు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే సాగర్ నిండితే చెరువులకు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే చెరువుల పటిష్ఠతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలతో వరదలు వస్తే చెరువులకు గండిపడే ముప్పు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 3,119 చెరువులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 1,628, సూర్యాపేట జిల్లాలో 1,224 చెరువులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 267 చెరువులు ఉన్నాయి. అయితే ఈ మూడు జిల్లాలో లష్కర్ల కొరత తీవ్రంగా ఉంది. చెరువులకు, ప్రాజెక్టులకు వచ్చే

ఎలాంటి సిబ్బంది కొరత లేదు

నీటి పారుదలశాఖలో వర్క్ చార్జెడ్ సిబ్బందికి సంబంధించి ఎలాంటి కొరత లేదు. గతంలో వీఆర్‌ఏలను వర్క్ చార్జెడ్ పోస్టింగ్‌లల్లో సర్దుబాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. జిల్లాలో ప్రస్తుతం చెరువుల్లో నీటిమట్టం మాములుగానే ఉంది. సిబ్బంది నిరంతరం పనిచేస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు.
- ఎస్.పార్వతీశ్వర్‌రావు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, నీటి పారుదల శాఖ, నల్లగొండ

క్షేత్ర స్థాయిలో కీలక సిబ్బంది ఏరీ?

కొన్ని చెరువులను మిషన్ కాకతీయ పునరుద్ధరించినప్పటికీ చాలా చెరువులకు కట్టలు పటిష్ఠంగా లేవు. కాల్వల్లో కంపచెట్లు పెరిగినా తొలగించే వారు కరువయ్యారు. తూములు, డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో నీరు సాఫీగా సాగకుండా గండిపడే ప్రమాదాలు ఉన్నాయి. లష్కర్లు, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ల కొరత అధికంగా ఉంది. నీటి పారుదల శాఖ పునర్ వ్యవస్థీకరణ అనంతరం చీఫ్ ఇంజనీర్లు, ఎస్‌ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈఈ, ఏఈల వరకు పోస్టులను సర్దుబాటు చేసినా, క్షేత్రస్థాయిలో సిబ్బంది అరకొరగానే ఉన్నారు.ప్రత్యామ్నాయంపై అధికార యంత్రాంగం చొరవ తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో సమస్యలు తీవ్రంగా ఉండనున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు ఉండగా వర్క్ చార్జెడ్, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అంతా కలిపి 450మంది వరకు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇక మూడు జిల్లాలో హెల్పర్‌లు, లష్కర్లు మొత్తం సుమారు 327 మంది ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాలో వర్క్ చార్జెడ్ సిబ్బందితో పాటు ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు మొత్తం 214మంది ఉండగా,హెల్పర్లు,లష్కర్లు 127మంది ఉన్నారు.

కొత్త పోస్టుల భర్తీ ఇప్పట్లో అసాధ్యమే!

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదలశాఖలో పోస్టుల భర్తీపై దృష్టి సారించలేదు. వివిధ గ్రూపుల పరీక్షల కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన తరువాతే ఈ పోస్టులు భర్తీకానున్నాయి. అయితే నోటిఫికేషన్ల జారీ ప్రస్తుతం లేకపోవడంతో ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అయితే ముందుగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని జలాశయాలకు సంబంధించిన ఖాళీలను పూర్తిగా గుర్తించాల్సిన అవసరం ఉంది. అధికారులు మాత్రం సిబ్బంది కొరత లేదని చెబుతున్నా వాస్తవ పరిస్థితులను చూస్తే ఉమ్మడి జిల్లాలోని చెరువులు, కుంటలపై సిబ్బంది కొరత ఉంది. చాలా చెరువులను సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. చెరువుల పటిష్ఠత ఎలా విధంగా ఉందనే విషయాన్ని ఇప్పటి వరకు ఉన్నతాధికారులు పరిశీలించారనే దానిపై స్పష్టత లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది చెబితేనే చెరువుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటిని దిగువకు విడుదల చేసేందుకు ప్రతీ ప్రాజెక్టు వద్ద నిపుణులైన ఆపరేటర్ల అవసరం ఉంటుంది. సంబంధిత శాఖలో నిపుణులైన ఆపరేటర్ల కొరత ఉండటంతో ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడాల్సిన అవసరం ఏర్పడింది. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిలో ఎంతమందికి నైపుణ్యం ఉంది అనేది గుర్తించడం కష్టంగా మారింది. గత సంవత్సరం కూడా వీఆర్‌ఏలను లష్కర్లు, ఇతర సహాయకులుగా విధుల్లో చేర్చుకున్నారు. వీరిలో ఎవ్వరికీ సరైన శిక్షణ ఇవ్వలేదు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) ఆధ్వర్యంలో ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నా నిబంధన ఉన్నా ఏళ్లుగా ఇది అమలుకు నోచుకోవడం లేదు. ఎవరైనా నిరుద్యోగులకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇచ్చి నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ఆపరేటర్లను నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. నీటి విడుదలకు ఎగువస్థాయి నుంచి ఆయకట్టు వరకు సిబ్బంది అవసరం. వారిలో లష్కర్లే కీలకం. అయినా సిబ్బంది కొరతను తీర్చాలన్నా ఆలోచన అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు కలగడం లేదు.



ఇటీవలం సాగర్ నీటిని విడుదల చేయడంతో పెన్‌పహాడ్ మండలంలో పహారా కాస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)



హుజూర్‌నగర్ గురుకుల పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న సీలింగ్

సమస్యలే పాఠాలు

విద్యార్థులుంటే ఉపాధ్యాయులు లేరు.. ఉపాధ్యాయులుంటే విద్యార్థులు లేరు

మౌలిక వసతులు కరువై విద్యార్థుల ఇక్కట్లు

ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. ఓ పక్క మౌలిక వసతులు కరువై విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా, మరో పక్క విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేక, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాశాఖలో ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం నిర్వహించినా పాఠశాలల్లో అవసరమైన చోట ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కాలేదు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది. సుమారు అరడుగు మేర నీరు నిలుస్తోంది. ఇక్కడి చదువుతున్న 500 మంది విద్యార్థులకు కేవలం 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సరిగా లేవు. తిరుమలగిరి మండలంలో విద్యార్థులు ఉన్నా సరిపడా ఉపాధ్యాయులు లేరు. నార్కట్‌పల్లి మండలంలో ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేరు. డిండి మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. చిట్యాల మండలం వెలిమినేడు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.

•7లో..



హుజూర్‌నగర్‌లో గురుకుల పాఠశాల పైకప్పు కురుస్తుండటంతో బకెట్ పెట్టిన విద్యార్థినులు (ఫైల్)

నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 27 : బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేస్తూ నూతన శిక్షాస్మృతులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఆ చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయవాది వంశీధర్‌రెడ్డి, ఆంధ్ర మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లక్ష్మి, కేశవ మెమోరియల్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ వాణి అక్కిరెడ్డి అన్నారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో శనివారం పట్టణంలోని క్లాక్‌టవర్‌సెంటర్‌లోని స్టే ఇన్ హోటల్‌లో న్యాయవాద పరిషత్ నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత చట్టాల్లోని కొన్నింటిని మారుస్తూ నూతన న్యాయసంహిత రూపొందించారని న్యాయవాదులు, ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐపీసీ ఇండియన్ ఎవిడెన్స్ యాక్టులలో తీసుకువచ్చిన మార్పులను ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. నూతన న్యాయ చట్టాలపై పలువురు న్యాయవాదులు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు. వర్క్‌షాప్‌లో న్యాయవాద పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సోమసాని సునీల్, కోశాధికారి మంగులాల్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మేరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చుక్కల్లా నాగరాజు, కట్ట సూర్య సంపత్, అక్కినపల్లి మురళీధర్ రావు, నన్నూరి రాంరెడ్డి, కాంపాటి యాదగిరి, నూకల నరసింహారెడ్డి, నేతి రఘుపతి, గార్లపాటి వెంకటయ్య, కే శ్రీనివాస్‌రెడ్డి, పల్లెబోయిన శ్యాంసుందర్, రాంప్రసాద్ అంజిరెడ్డి, హరి రామ్, ఎంపీ రమేష్, రాథోడ్, సుమశ్రీ, సంధ్యారాణి, ప్రమీల భాగ్య, ఫాతిమా, జే.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ సమాజ ఉద్దీపనకు గత త్యాగాలే పునాది



సెమినార్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీవీవీ నాయకులు

మిర్యాలగూడ, జూలై 27 : భవిష్యత్ సమాజ ఉద్దీపనకు గత త్యాగాలే పునాదిగా నిలుస్తాయని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు బెల్లంకొండ హరికృష్ణ అన్నారు. ఈ నెల 28న జరిగే జయశంకర్ సార్ స్మారకోపన్యాస సెమినార్ కరపత్రాన్ని శనివారం విజేత కళాశాలలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. స్వీయ అస్థిత్వం కోసం కొనసాగించిన ఉద్యమం తెలంగాణ కన్నీళ్లను, రక్తాన్ని పారించిందన్నారు. మూడు తరాల ఉద్యమానికి వారధిగా నిలిచి తెలంగాణ లక్ష్యాన్ని తీరం చేర్చిన వైతాళికుడు జయశంకర్ సార్ అని అన్నారు. 2004లో జయశంకర్ సార్ ఆధ్వర్యంలో ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం ఏర్పడిన టీవీవీ రాష్ట్ర సాధనోద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ నెల 28 ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 13వ స్మారకోపన్యాస సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీవీవీ డివిజన్ నాయకులు నాగయ్య, శ్రీనివాసాచారి, దుర్గయ్య, ప్రభాకర్, రాంరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ పాటించాలి: డీఈవో



మధ్యాహ్న భోజనం నాణ్యతను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుంటున్న డీఈవో

మునుగోడు, జూలై 27 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ తప్పక పాటించాలని డీఈవో బిక్షపతి ఆదేశించారు. మునుగోడు హైస్కూల్‌ను శనివారం తనిఖీ చేశారు. వడ్డించేందుకు సిద్ధం చేసిన వివిధ వంటకాల నాణ్యతను పరిశీలించారు. రోజువారీగా అమలు చేసే నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల నిర్వహణ రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. భోజనం నాణ్యత లేకుంటే చర్యలు తప్పవన్నారు. డీఈవో వెంట ఇన్‌చార్జి ఎంఈవో కెనర్సింహ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన ఉండాలి: కలెక్టర్



చింతపల్లి సాయిసన్నిధిలో పూజల్లో పాల్గొన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి దంపతులు

చింతపల్లి, జూలై 27 : సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబ దేవాలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ట్రస్టు చైర్మన్, సభ్యులు కలిసి గోశాల ఏర్పాటు చేసి 400 గోవుల సంరక్షించడం అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులు కలెక్టర్ కుటుంబసభ్యులను సన్మానించారు. క్రికెట్ యూత్ అసోసియేషన్ సభ్యులు చింతపల్లిలో క్రీడామైదానం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, తడకమళ్ల శ్రీనివాస్, కుంభం పుల్లా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

సీఎం కలిసిన సీపీఎం బృందం



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

నల్లగొండ రూరల్, జూలై 27 : డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల పూర్తికి, మూసీ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు బృందం శనివారం సీఎంను కలిసి వినతిపత్రం అందజేసింది. సాగర్ ఎడమ కాల్వలపై ఉన్న ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరింది. నల్లగొండ జిల్లాలో మునుగోడు నియోజకవర్గంలో సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నారు. సీపీఎం బృదం చేప్పిన సమస్యలకు సీఎం సానుకూలంగా స్పందించారని సీపీఎం బృందం తెలిపింది. బృందంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య, జిగయ్య, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

చెర్వుగట్టులో జాతీయ శైవాగమ సదస్సు

- సోమేశ్వర శివజ్ఞానపీఠం వేదికగా నిర్వహణ
- మూడు రోజుల పాటు పండిత సభలు



నార్కట్‌పల్లి, జూలై 27: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ సోమేశ్వర శివజ్ఞాన పీఠం వేదికగా త్రిదినాత్మక జాతీయ శైవాగమ సదస్సు జరగనుంది. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు జరిగే సదస్సును తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికతలో చొచ్చుకు వస్తున్న ఆధునికత నేపథ్యంలో పీఠాధిపతులు సూచించిన ఆగమ శాస్త్రాల ప్రాభవం, అర్చనా విధులపై ఈ తరం అర్చకుల్లో అవగాహన కల్పించే దిశగా ఈ సదస్సు జరగనుంది. ఈ జాతీయ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో పండితులతో పాటు దక్షణాది రాష్ట్రాల నుంచి ప్రముఖ శివాచార్యులు హాజరు కానున్నారని సదస్సు నిర్వాహకుడు తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, కార్యదర్శి హరికిషన్‌శర్మలు సంయుక్తంగా చేసిన ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సు కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 28న శైవాగమ విస్తృత పరిచయం, ఆహ్నిక వైశిష్ట్యం, శైవాగమోక్త ఆత్మార్థపూజా పరిచయం, 29న దేవతార్చనా విధులు, మహోత్సవ విధులు, లుప్తమైన అంశాలు, పునరుద్ధరణ, వార, పక్ష, మాస అయనాది విశేష ఉత్సవాలకు మార్గాన్వేషణ, పవిత్రోత్సవ ఆవశ్యకత, వివరణలు అంశాలుగా ఉండనున్నాయి. 30న దీక్షా వైశిష్ట్యం, జీర్ణోద్ధరణ, ప్రతిష్ఠా విధులు, ప్రాయశ్చిత్తములు అంశాలపై సదస్సులో శివాచార్యులైన వక్తలు తమ సలహాలను ఇవ్వనున్నారు.



జిల్లాలో ఎరువుల కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్



వ్యవసాయ అధికారులతో సమీక్షను నిర్వహిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ, జూలై 27: జిల్లాలో సాగుకు ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం సహాయ వ్యవసాయ సంచాలకులు పోరెడ్డి నాగమణి, మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి మండలంలోని ఎరువుల గోదాంలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎరువుల లభ్యతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వేర్‌హౌజ్, హోల్‌సెలర్స్, రిటైలర్స్ వద్ద కలిపి జిల్లాలో యూరియా 46,605. 458 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,348. 462, ఎంఓపీ 1,793. 250, ఎన్‌పీకేఎస్ 28,041. 355, ఎస్ఎస్‌పీ 995. 575, కంపోస్ట్ 103. 400, ఎఫ్ఓఎం 24.000 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. రైతువేదికలో రుణమాఫీ, రైతుబీమాపై రైతులతో ముఖాముఖి చర్చించారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారులు మండలంలో రైతుబీమా, పంట వివరాలను నమోదు చేయాలని సూచించారు. అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత, మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మహేష్‌కు ఘననివాళి

- అంతిమయాత్రలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు
- పార్థీవానికి పలువురు ప్రజాప్రతినిధుల నివాళి
- స్వగ్రామంలో పూర్తయిన అంత్యక్రియలు

•7లో..

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూలై 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శనహోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ఆలయఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ.19,79,989 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, పుదుచ్చేరి హోంమంత్రి తిరు ఏ.నమశ్శివాయన్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఈవో భాస్కర్‌రావు శేషవస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటంతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ.వేణుగోపాల్, టీ.వినోద్‌కుమార్, లక్ష్మణ్, కే.సుజన శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, స్వామివారి చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఈవో భాస్కర్‌రావు అందజేశారు. అదేవిధంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సైతం స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు కొండపైన ఆయనకు ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయనను కలిసినవారిలో డీఆర్డీవో ఎంఏ.కృష్ణణ్ ఉన్నారు.



స్వామి వారి నిత్యకల్యాణోత్సవం, హైకోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ప్రభుత్వ విప్

యాదగిరిగుట్టలో నూతనంగా కోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ.వేణుగోపాల్, కే.సుజనను శనివారం ప్రెసిడెన్షియల్ సూట్‌లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థాన పరిధిలోని తులసీ కాటేజీలోని ఓ భవనంలో జూనియర్ సివిల్, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును విప్ పరిశీలించారు.

FARNAZ

సమస్యలే పాఠాలు



వెలిమినేడు బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక కూర్చున్న ప్రధానోపాధ్యాయురాలు

● విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల ● విద్యార్థులు రాకపోతే ఉపాధ్యాయులు ఎదురు చూపులే ● నానాటికీ తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకప్పుడు తరగతుల నిండా విద్యార్థులు ఉండే వారు. సెక్షన్‌ల వారీగా విభజించి మరీ ఉపాధ్యాయులు పాఠాలు బోధించే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గుతోంది. కొన్ని తరగతుల్లో కేవలం ఇద్దరు, ముగ్గురు విద్యార్థులే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వారి కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా పరిస్థితి మారడం లేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా మాతపడుతున్నాయి.

విద్యార్థులులేక వెలవెల

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో 11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 121మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 1,050మంది చదువు తున్నారు. 6వ తరగతి విద్యార్థులు 120 మంది, 7వ తరగతి విద్యార్థులు 218 మంది, 8వ తరగతి విద్యార్థులు 231మంది, 9వ తరగతి విద్యార్థులు 252, 10వ తరగతి విద్యార్థులు 230మంది నమోదైనట్లు మండల విద్యాశాఖ ఎన్‌రోల్‌మెంట్ రికార్డు చెబుతోంది. ఏపీలింగోటం, శాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 25కు మించలేదు. రెండు పాఠశాలల్లో 8మంది చొప్పున అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులున్నారు. ఏపీలింగోటం జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతిలో ఐదుగురు, 9వ తరగతిలో నలుగురు, 8వ తరగతిలో నలుగురు, 7వ తరగతిలో నలుగుగురు, 6వ తరగతిలో ఐదుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. శాపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతిలో ఏడుగురు, 7వ తరగతిలో ముగ్గురు, 8వ తరగతిలో 8మంది, 9వ తరగతిలో 8మంది, 10వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.



నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం జడ్పీహెచ్ఎస్

విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల ఎదురు చూపులు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. పాఠశాలలో రికార్డుల ప్రకారం పాఠశాలకు వలస కార్మికులకు చెందిన వారి పిల్లలు సుమారు 29మందికి పైగా పాఠశాలకు వచ్చేవారు. వారిలో చాలామంది ప్రస్తుతం పాఠశాలకు రావడం లేదు. అక్టోబరు మాసంలో తల్లిదండ్రులు తిరిగి గ్రామానికి వస్తే వారి పిల్లలను పాఠశాలకు పంపిస్తారు. పాఠశాలలో 1వ తరగతిలో విద్యార్థులు లేరు. 2వ తరగతిలో 21మంది, 3వ తరగతిలో ఇద్దరు, 4వ తరగతిలో నలుగురు, 5వ తరగతిలో ఇద్దరు, మొత్తం 29మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. హాజరయ్యేది మాత్రం ఇద్దరు విద్యార్థులే. వారిలో మూడో తరగతికి చెందిన ఓ విద్యార్థిని, ఐదో తరగతికి చెందిన మరో విద్యార్థిని ఉన్నారు. వారు గైర్హాజరైతే ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. లేకుంటే గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు బీసీకాలనీకి చెందిన 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 20మంది విద్యార్థులు జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్తున్నారు. జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్తే బీసీ కాలనీకి చెందిన విద్యార్థులను అదే కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు బదలాయిస్తే పాఠశాల పురోగతితో పాటు విద్యార్థులతో కళకళలాడుతుంది. పాఠశాల కూడా మూతపడే ఆస్కారం ఉండదు. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడంతో ఒక ఉపాధ్యాయురాలిని మండలంలోని సుంంకెనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు.

మూత పడుతున్న ప్రభుత్వ పాఠశాలలు

డిండి: మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. ఇందులో కొన్ని పాఠశాలలు గతంలో మూతపడగా మరికొన్ని ఇటీవల మూతపడ్డాయి. ఈ విద్యాసంవత్సరం కొత్తతండా, బొగ్గులదొన ప్రాథమిక పాఠశాలల తోపాటు ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడింది. బొగ్గులదొన పాఠ శాలలో గత విద్యాసంవత్సరం 30మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం పాఠశాల మూతపడింది. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు వంతులవారిగా రావడం, సమయపాలన పాటించకపోవడం, విద్యా ప్రమాణాలు పడిపోవడంతో పాఠశాలకు తాళం పడింది. మండలంలోని ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలలో మంది విద్యార్థులు, రుద్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ చూపుతున్నారు. ఉన్నత పాఠశాలలలో టి.గౌరారంలో 5 తరగతులకుగాను 45మంది విద్యార్థులు, కామేపల్లి ఉన్నత పాఠశాలలో 55మంది విద్యార్థులు ఉన్నట్లు ఎన్‌రోల్‌మెంట్ నమోదై ఉంది. ఒక తరగతిలో 1 నిష్పత్తి 40 ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య ఐదు తరగతులు కలిపి 45కు తగ్గింది. క్రమంగా ఉన్నత పాఠశాలకు కూడ మూతపడే ప్రమాదముంది. ఏళ్ల తరబడి మండల విద్యాధికారుల నియామకం చేపట్టకపోవడంతో ఒక ఎంఈవో మూడు మండలాలలోని పాఠశాలలను పర్యవేక్షించాల్సి వస్తోంది.

బదిలీపై వెళ్లిన 33మంది ఉపాధ్యాయులు

ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టడంతో ఆ ప్రభావం మారుమూల పాఠశాలలపై పడింది. మండలంలోని 24ప్రాథమిక పాఠశాలల పరిధిలో 33 మంది ఉపాధ్యాయులు ఈ విద్యాసంవత్సరం బదిలీపై వెళ్లగా ముగ్గురు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి విధుల్లో చేరారు. కొందరికి బదిలీ అయినా విద్యాశాఖ వారిని రిలీవ్ చేయలేదు.



తల్లిదండ్రులు వలస వెళ్లడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది

తల్లిదండ్రులు వలస వెళ్లడం వల్ల వారి పిల్లలను కూడా వెంట తీసుకొని వెళ్లారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అక్కడి ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతాం.

● సామ్యానాయక్, ఎంఈవో.

పాఠాలు.. పంచాయితీలూ ఇక్కడే

తుర్కపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో పక్క పక్కనే రెండు తరగతి గదులు ఉన్నాయి. పాఠశాలలో 26మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు తరగతులకు కలిపి ఒకే గది ఉండడంతో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులను వరండాలో, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను తరగతి గదిలో కూర్చొబెట్టి పాఠాలు బోధించాల్సిన పరిస్థితి. వర్షం వచ్చినప్పుడు జల్లులు విద్యార్థులపై పడుతున్నప్పుడు వరండాలో ఉన్న విద్యార్థులను కూడా తరగతి గదిలోనే ఉంచి అక్కడే పాఠాలు చెప్పాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గోడలపై వేసిన పేయింట్స్ వృథా

విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠాలు బోధించేందుకు రూ.10వేలతో ఓ తరగతి గదిలోని గోడలపై తెలుగు, ఆంగ్ల వర్ణమాల, గుణింతాలు, నంబర్స్ చార్ట్స్ వంటివి పేయింట్ వేయించారు. ఆ తరగతి గదిని గ్రామపంచాయతీ నిర్వహణకు ఉపయోగిస్తుండడంతో అక్కడ విద్యార్థులు కూర్చునేందుకు వీలు లేకపోవడంతో పేయింట్స్ విద్యార్థులకు ఉపయోగపడడం లేదని ఉపాధ్యా యులు తెలిపారు. మరోవైపు ఈ పాఠశాల ఆవరణలో ఉన్న మధ్యాహ్న భోజన వంటగదిలో పది సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తు న్నారు. మధ్యాహ్న భోజనం ఆరు బయటే వంటలు చేయాల్సి వస్తోంది.

అంతా గందరగోళం

తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో బాబుల్‌నాయక్‌తండా గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణకు భవనం లేక పోవడంతో గ్రామస్థుల సూచన మేరకు ఐదుసంవత్సరాల నుంచి పాఠశాల భవనంలో ఓ గదిని కేటాయించారు. గ్రామసభలు, పింఛన్ల పంపిణీ, ప్రతినెలా వైద్య శిబిరం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించడం కష్టంగా మారింది. గ్రామంలో జరిగే పంచాయితీలు కూడా ఇక్కడే నిర్వహిస్తుండడంతో అంతా గందరగోళంగా మారుతోంది. విద్యార్థులకు సరిపోను తరగతి గదులు నిర్మించి, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వేరే చోట ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రెండు గదులు.. పాఠశాల తరగతి గది, పక్కనే గ్రామపంచాయతీ కార్యాలయం

గురుకుల పాఠశాలలో అస్తవ్యస్తం

హుజూర్‌నగర్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల అస్తవ్యస్తంగా ఉండగా, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఐదు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులు సుమారు 500 మంది వసతి పొందుతున్నారు. గురుకుల పాఠశాల భవనంలోని పైఅంతస్తులో రేకుల షెడ్డు ఉంది. మూడో అంతస్తులో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు వందమందికి పైగా ఇంటర్‌లో విద్యార్థినులు ఉండగా, ఆరు గదులే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదులు మొత్తం కురవగా, ఆరు గదుల్లో గోడల వెంట నీళ్లు కారడంతో పాటు రేకులకు మేకులు బిగించిన చోట పెద్ద మొత్తంలో నీరు కారి సుమారు అరడుగు మేర నిలిచింది. రాత్రిపూట నిద్రించే గదులు సైతం కురుస్తున్నాయి. 500 మందికి కేవలం 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సక్రమంగా లేవు. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడో అంతస్తులో ఉన్న రేకులు లేచిపోయాయి. పదిరోజుల క్రితం వర్షం కురిసే సమయంలో ఆర్డీవో శ్రీనివాసులు ఈ పాఠశాలను పరిశీలించి భవన మరమ్మతులు చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలని యజమానికి చెప్పినా స్పందించడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



గురుకులంలో ఊడిపోయిన సీలింగ్

టీచర్లు లేని చదువెలా

తిరుమలగిరిరూరల్: మండలంలోని తాటిపాముల, తొండ, వెలిశాల, జలాల్‌పురం, గుండెపురి, తిరుమలగిరి గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉండగా, 973 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తాటిపాముల, తొండ, తిరుమలగిరి ఉన్నత పాఠశాలలో మాత్రమే అన్ని సబ్జెక్ట్‌లు బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. గుండెపురి, జలాల్‌పురం, వెలిశాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో చదువెలా అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గుండెపురి ఉన్నత పాఠశాలలో సోషల్, ఇంగ్లీష్, తెలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీ, బయోసైన్స్, పీఈటీ పోస్టులు ఇక్కడ లేవు. వెలిశాల ఉన్నత పాఠశాలలో గణితం, సోషల్ పోస్టులు, జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా ఖాళీలను భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక హరీష్ వాఖ్యలు : విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి అర్బన్, జూలై 27: కాంగ్రెస్ పాలనకు ప్రజాదరణ చూసి ఓర్వలేక మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం శాసనసభలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు విప్ కౌంటర్ ఇచ్చారు. ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రజానికాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన వాగ్దానాలను విస్మరించి కాంగ్రెస్ ప్రజాపాలనపై విరుచుకుపడటం సిగ్గుచేటన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి వంటి పథకాలు బీఆర్ఎస్ హయాంలో అమలు కాలేదన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

వ్యవసాయంపై మంత్రులకు అవగాహనేలేదు: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులకు సాగునీరు, వ్యవసాయంపై అవగాహనలేదని, కాళేశ్వరంపై బీజేపీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ పేరుతో నాటకాలాడుతోందని మాజీమంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రా కోసమే పుట్టినట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. నీళ్లు ఎలా లిఫ్ట్‌చేయాలో తెలిసే కేసీఆర్ కన్నెపల్లివద్ద పంప్‌హౌస్ నిర్మించారని, మేడిగడ్డకు ఏదో జరిగిందని ఇప్పటి వరకు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మేడిగడ్డవద్ద 10లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని చెబుతోందన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్లలేక ఎండిపోతున్నాయని, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలి: సాంస్కృతిక సారధి సభ్యులు

వలిగొండ, జూలై 27: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ సంస్కృతిక కళాకారుల సారధి శనివారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ కళాకారుల సమస్యలను సీఎంతో చర్చించి తమకు న్యాయం చేయాలని కళాకారులు కోరారు. కళాకారుల బృందం నాయకులు అంజనేయులు పాల్గొన్నారు.

రైల్వేప్లాట్‌ఫాంపై జాతీయపక్షి నెమలి కళేబరం

ఆలేరు రూరల్, జూలై 27: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని రైల్వే ప్లాట్‌ఫాంపై మృతి చెంది ఉన్న జాతీయపక్షి నెమలిని రైల్వే సిబ్బంది శనివారం గుర్తించారు. 2వ ప్లాట్‌ఫాంపైకి నెమలి ఎలా వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని రైలు ప్రయాణికుడు రైలు నుంచి పడవేసి ఉంటారని భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులకు విషయం తెలియజేసినా వారు ఆలస్యంగా స్పందించినట్లు తెలిసింది. చివరికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన అటవీశాఖ అధికారులు నెమలి మృతదేహాన్ని తీసుకెళ్లారని రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం ఆలేరులో ఆ నెమలిని దహనం చేసినట్లు ఫారెస్ట్ అధికారి నిఖిత తెలిపారు.

నెమలిపై కోతుల దాడి

భువనగిరి టౌన్, జూలై 27 : భువనగిరి పట్టణంలోని కిసాన్‌నగర్ పార్కులోకి శనివారం సాయంత్రం నెమలి వచ్చింది. జనావాసాల మధ్య ఉన్న పార్కులోకి వచ్చిన నెమలిపై కోతులు అరుస్తూ దాడి చేస్తుండడంతో తప్పించుకునేందుకు నెమలి పార్కులోకి పరుగులు తీసింది. కోతులు, నెమలి శబ్దాలను విన్న స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ఎండీ.అంజద్ వెంటనే అప్రమత్తమై కోతులను పారదోలాడు. అప్పటికే గాయపడిన నెమలిని అటవీ శాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి అప్పగించాడు. దీంతో అధికారులు నెమలికి ప్రాథమిక చికిత్స అందించారు. కోలుకున్నాక అడవిలో వదిలిపెడతామని పేర్కొన్నారు.



గాయపడిన నెమలితో అంజద్

లైన్‌మన్‌పై దాడి: కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, జూలై 27: చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్లసింగారం లైన్‌మన్ ఎలిజాల శ్రీనివాస్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసింగారంలో వీధిలైట్లు ఎందుకు రావడం లేదని ఊదరి నర్సింహ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం లైన్‌మన్‌కు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. అది తమ పరిధి కాదని మునిసిపాలిటీ సిబ్బంది చూసుకుంటారని లైన్‌మన్ తెలిపారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరగనుంది. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డు ఫేమస్ బేకరి వద్ద ఉన్న లైన్‌మన్ శ్రీనివాస్‌పై నర్సింహతో పాటు అతని అనుచరులు దాడి చేశారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు నర్సింహతోపాటు అతని అనుచలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుటుంబకలహాలతో మునిసిపల్ ఉద్యోగి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్, జూలై 27: కుటుంబ కలహాలతో యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపల్ ఉద్యోగి బలవన్మరణం చెందాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకార.. మునిసిపల్ ఉద్యోగి దూడల నర్సింహగౌడ్(54) కుటుంబ కలహాలు భరించలేక శుక్రవారం రాత్రి తన ఇంట్లోని రేకులషెడ్‌లో ఉరి వేసుకున్నాడు. శనివారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే నర్సింహగౌడ్ మృత్యువాతపడ్డాడు. నర్సింహగౌడ్ కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా నర్సింహగౌడ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జవాన్ మహేష్‌కు ఘననివాళి

● భారీగా తరలివచ్చిన ప్రజలు
● మహేష్ అమర్‌హై అంటూ హోరెత్తిన నినాదాలు
● సైనిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

హాలియా, జూలై 26: దేశరక్షణ కోసం అస్సాంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన భారత జవాన్ అగ్నివీర్ ఈరేటి మహేష్ పార్థీవ దేహానికి సైనిక లాంఛనాలతో వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని సైనిక కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో మహేష్ పార్థీవాన్ని హాలియా వద్దకు తీసుకువచ్చారు. పట్టణంలో సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతిమయాత్రలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాల యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాలియా పట్టణంలో ప్రారంభమైన యాత్రకు పెద్దవాగు బ్రిడ్జి వద్ద ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం మెయిన్ సెంటర్ వరకు యాత్ర కొనసాగించి ప్రధాన సెంటర్‌లో మహేష్ గౌరవసూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలో సుమారు మూడు కిలోమీటర్ల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు మహేష్ అమర్‌హై, జై జవాన్, భారత్‌మాతాకీ జై అనే నినాదాలతో హోరెత్తించారు.

సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలోని మహేష్ వ్యవసాయ క్షేత్రంలో పార్థీవ దేహానికి సైనిక, ఎన్‌సీసీ అధికారులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనికుల బృందం వారి సంప్రదాయ పద్ధతిలో గౌరవ సూచికంగా వందనం సమర్పించారు. విలపిస్తున్న మహేష్ తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వచ్చిన సైనికాధికారి జాతీయజెండాను అందజేశారు. అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు, బంధువులు, చిన్నారులు, మహిళలు, భావోద్వేగానికి గురయ్యారు.



మహేష్ పార్థీవ దేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

అంత్యక్రియలకు తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు

అస్సాంలోని దబీర్‌ఘట్ ప్రాంతంలో భద్రత విధుల్లో ఉంటూ అనారోగ్యానికి గురై మృతి చెందిన మహేష్ అంతిమయాత్రంలో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని మహేష్ పార్థీవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సైతం మహేష్‌కు నివాళులర్పించి వారి తల్లితండ్రులను ఓదార్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్, బీజేపీ నాయకులు రిక్కల ఇంద్రసేనారెడ్డి, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి అంజనేయులు, వర్ర వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో జవాన్ మహేష్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు



మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న సైనికులు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : డీటీఎఫ్

నల్లగొండ టౌన్, జూలై 27: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. సోమయ్య అన్నారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. 29రాష్ట్రాల్లో కేవలం తెలంగాణలో మాత్రమే విద్యారంగానికి సింగిల్ డిజిట్‌లో నిధులు కేటాయించి చిట్టచివరి రాష్ట్రంగా నిలిచిందన్నారు. డాక్టర్ డీఎస్ కోఠారి వంటి మేధావులు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని తమ రిపోర్ట్‌లో పేర్కొన్నా విద్యారంగానికి ప్రభుత్వాలు క్రమంగా కేటాయింపులు తగ్గిస్తున్నాయన్నారు. కనీసం 20శాతం నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు ఆర్.విజయ్‌కుమార్, పి. వెంకులు, ప్రధాన కార్యదర్శి కె. రత్నయ్య, ఖుర్షీద్‌మియా, పి. ఏడుకొండల్, కాశయ్య, ఆర్. లక్ష్మయ్య, పీడీఎస్‌యూ బాధ్యులు జానీ, ఆనంద్, పీఎల్‌వై ఇందూరి సాగర్, విద్యావంతుల వేదిక బాధ్యుడు పందుల సైదులు ఉన్నారు.



క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

శాపల్లిలో 'అఖండం' ప్రారంభం

● 41 రోజుల పాటు గ్రామంలో దీపంతో ఊరేగింపు

నార్కట్‌పల్లి, జూలై 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లిలో ఆషాడంలో నిర్వహించే 'అఖండం' వేడుక శనివారం రాత్రి ప్రారంభమైంది. వందేళ్ల క్రితం పూర్వీకుల నుంచి సంక్రమించిన సాంప్రదాయాన్ని గ్రామస్థులు నేటికీ ఆచారంగా కొనసాగిస్తున్నారు. ఆధునిక వైద్య సౌకర్యం అందుబాటులో లేని సమయంలో అసలు ఏ రోగం వచ్చి మనుషులు చనిపోతున్నారో కూడా తెలియని రోజుల్లో మమ్మల్ని కాపాడమంటూ శాపల్లి గ్రామ పూర్వీకులు గ్రామ దేవతలను పూజిస్తూ ప్రారంభించిన ఉత్సవమే ఈ అఖండం. ప్రతి ఏటా ఆషాడం మాసం సప్తమి తిథిన గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న అఖండ దీపం వెలిగించి ప్రారంభిస్తారు. 41 రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం గ్రామంలో భజనలు, కోలాటాలతో దీపంతో ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా ఈ అఖండ దీపాన్ని పట్టుకునే వ్యక్తి 41రోజుల పాటు నియమ నిష్టతో సాత్విక జీవనం గడపాల్సి ఉంటుంది. 41రోజుల అఖండం పూర్తైన తర్వాత గ్రామంలో కమలాద్రి లక్ష్మీనరసింహుని ఊరేగింపుతో దీపాన్ని తిరిగి ఆలయంలోకి చేర్చడంతో అఖండం వేడుక ముగుస్తుంది.



అఖండ ఉత్సవం నిర్వహిస్తున్న శాపల్లి గ్రామస్థులు

సారా రవాణా చేస్తే చర్యలు

హుజూర్‌నగర్, జూలై 27: సారా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవరి సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన 13 వాహనాలను శనివారం వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,15,000లు అని, కాని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 122శాతం అధికంగా రూ.2,56,296లకు 13వాహనాలను అమ్మినట్లు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ సారాకు అవసరమైన ముడి సరుకును రవాణా చేసినా, నిల్వ చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు. పలు మార్లు కేసులు నమోదైతే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ జగన్‌మోహన్ రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

» అస్తవ్యస్తంగా మారిన పిట్టంపల్లి రహదారి
» పట్టించుకోని ప్రతినిధులు, అధికారులు
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టణ ప్రజలు


అధ్వానంగా తయారైన పిట్టంపల్లికి వెళ్లే రహదారి

రామగిరి, జూలై 27: నల్లగొండ పట్టణాన్ని వేల కోట్లతో సుందరీకరణ చేశామని చెబుతున్న పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నల్లగొండ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాలలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ప్రధానంగా మర్రిగూడ బైపాస్ పైనుంచి పిట్టంపల్లికి వెళ్లే రోడ్డు పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డు అంతా గుంతలమయంగా ఏర్పడి ఆ గుంతల్లో నీరు నిలవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రెండు కిలోమీటర్ల వరకు ఒక అడుగులోతు గుంతలు 250కి పైగా ఉన్నాయి. ఈ దుస్థితి కొన్నేళ్లుగా ఉంది. ఈ విషయమై ఆ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పదేళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాయకులు, అధికారులు మారుతున్నారు తప్ప ఈ రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఇటు నుంచి వెళ్లే ప్రజలు నానా యాతన పడుతున్నారు. గతంలో రోడ్డును మరమ్మతు చేయించాలని ధర్నాలు, రాస్తారోలు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కూడా స్థానికులు మొరపెట్టుకున్నా ఎక్కడ వేసిన గొంగిడి అక్కడే ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలోనే పరిస్థితి ఇలా ఉందంటే మంత్రి నియోజకవర్గంలోనే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును మరమ్మతు చేయించాలని చంద్రగిరి విలాస్, తాళ్లబాయిగూడెం, బాదగూడెం, ఓసీటీఎల్ కాలనీ, వినాయకనగర్, కాలనీ వాసులు, పిట్టంపల్లి ప్రాంత ప్రజలు పాలకులను కోరుతున్నారు. లేదంటే మునిసిపల్ కార్యాలయం, మంత్రి ఇంటి ఎదుట కూడా ధర్నా చేసేందుకు వెనుకాడబోమని పేర్కొంటున్నారు.

రోడ్డు నిర్మాణాల కోసం డీపీఆర్ తయారు చేస్తున్నాం

రోడ్డు నిర్మాణాల కోసం డీపీఆర్ తయారు చేస్తున్నాం. నల్లగొండ పట్టణంలోని శివారు ప్రాంతాల్లో సుమారు 57 కిలోమీటర్ల రోడ్లు, 47 కిలోమీటర్ల సీసీలు, డ్రైనేజీలు ఈ ప్రతిపాదనలో ఉన్నాయి. వీటికి సుమారుగా రూ. 140 కోట్లు ఖర్చుకానుంది. ఈ ప్రతిపాదనలో పిట్టంపల్లి రోడ్డుతో పాటు జీఎం కన్వెన్షన్ సమీపంలోని, ప్రధాన రహదారి నడ్డివారిగూడెం, అక్కలాయిగూడెం, గంధం వారి గూడెం వంటి ప్రాంతాలు కూడా ఉన్నాయి. మరో రెండు నెలల్లో టెండర్ ప్రాసెస్ కావచ్చు.

- రాములు, మునిసిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

దొరల పాలన సాగించిన గత పాలకులు

● మంత్రిపై వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ మంత్రి హరీ్‌షరావు ఫ్లెక్సీ దహనం

నల్లగొండ రూరల్, జూలై 27: బీఆర్ఎస్ పార్టీ హయాంలో కేసీఆర్, కేటీఆర్, హరీ్‌షరావులు దొరలపాలన సాగించారని, వారు పదేళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని యూత్ పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు అన్నారు. మంత్రి కోమటిరెడ్డిపై హరీ్‌షరావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నిరంతరం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. గత పాలన నచ్చకపోవడం వల్లే ఆ పార్టీపై విసుగు చెంది ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పారని అన్నారు. ఇప్పటికైనా హరీ్‌షరావు మంత్రి వెంకట్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాదం అనిల్, జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, జూలై 27: పెన్షనర్ల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షన్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) జిల్లా అధ్యక్షుడు నూకల జగదీ‌ష్‌చంద్ర, ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల్లో ప్రధానంగా నాలుగు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, ఆరోగ్య పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిల్లో వైద్యం అందించాలని అన్నారు. రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఐఆర్‌ను 5 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30వ తేదీన ప్రభుత్వ పింఛన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆ ధ్వర్యంలో చేపట్టనున్న పెన్షనర్ల మౌనదీక్షను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను అభినందించిన ఎస్పీ


సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ

కొండమల్లేపల్లి, జూలై 27: అపస్మారక స్థితిలో ఉన్న మహిళను గుర్తించి వెంటనే పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించిన పోలీసులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. కొండమల్లేపల్లి మండలం అంగోతుతండాకు చెందిన నందు క్షణికావేశంలో ఉరి వేసుకోగా గమనించిన భర్త శ్రీనివాస్ ఆస్పత్రికి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నాడు. ఈ క్రమంలో అదే సమయానికి పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించి నందు ప్రాణాలు కాపాడడంపై ఎస్పీ శరత్‌చంద్రపవార్ కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, ఎస్ఐ రాంమూర్తి, కానిస్టేబుల్ మజీద్, రాము, ప్రవన్, మల్లికార్జున్‌లను శనివారం ఎస్పీ కార్యాలయంలో అభినందించారు.

నిరాడంబరుడు, మానవతావాది కలాం

మిర్యాలగూడ, జూలై 27: ప్రపంచ మేధావి, నిరాడంబరత కలిగిన మానవతావాది మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అని జనయేత్రి ఫౌండేషన్ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అన్నారు. శనివారం కలాం వర్ధంతి సందర్భంగా జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్షిపణి శాస్త్ర పితామహుడు అబ్దుల్ కలాం కలలు కనండి వాటి సాకారానికై నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చిన మహనీయుడని కొనియాడారు.నలభై విశ్వవిద్యాలయాల నుంచి ఏడు గౌరవ డాక్టరేట్లు పొందారని అన్నారు. ఆయన్ను నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు దైద శ్రీనివాస్, నాయకులు రూహిద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

మర్రిగూడ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడలో నిర్వహించిన రామదూత సన్నిధి యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు.

బీజేపీది ఆర్థిక అసమానతల పాలన : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మునుగోడు, జూలై 27: దేశంలో ఆర్థిక అసమానతలను పెంచి పోషించే విధంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలన సాగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆరోపించారు. మునుగోడులోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి మండల శాఖల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూనే మరోవైపు బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి నిధుల్లో కోతలు విధిస్తోందని విమర్శించారు. ఈ చర్యలు కార్పొరేట్ వర్గాలకు వరాలు.. పేదలకు భారాలు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని బడ్జెట్ సమావేశంలో ప్రస్తావించకపోవటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు ఎలాంటి నిధులు కేటాయించకపోవటం పక్షపాతం చూపటమేనని అన్నారు. ఎన్నికల హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2లక్షలు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుతో పాటు దిగువన నిర్మించే శివన్నగూడెం ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని, భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గాలయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో ఎస్.రామలింగయ్య, గురిజ రామచంద్రం, వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, నలపరాజు సతీష్, బిక్షంరెడ్డి, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వీరశేఖర్

త్రిపురారం జూలై 27: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా, సైబర్‌మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరశేఖర్ కోరారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై శనివారం విద్యార్థులకు పోలీస్ కళాబృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరశేఖర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి, యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబసభ్యులు పడే బాధల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి


పర్యావరణ క్లబ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మర్రిగూడ, హాలియా, జూలై 27: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం అన్నారు. మర్రిగూడ మండలంలోని దామెర బీమనపల్లిలో పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు శనివారం ఎకోక్లబ్ ఫర్ మిషన్ లైఫ్ (పర్యావరణం కోసం జీవన శైలి) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్లకార్డులతో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చెట్లను నరికితే తల్లిని నరికినట్టేనని పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాలలో ఎకో క్లబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బిట్టు శ్రీను, ఉపాధ్యాయులు కొండ శ్రీను, వాలంటరీ అమీనా విద్యార్థులు పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీ న్యూకిడ్స్ పాఠశాలలో గ్రీన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా గ్రీన్ వస్త్రాలను ధరించి అలరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మనాది రవీందర్, పాఠశాల హెచ్ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాలియా: హాలియా మున్సిపాలిటీలోని కృష్ణవేణి పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణలో అందరినీ అలరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు నృత్యాలు చేసి పలువురిని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీఆర్టీయూ కృషి


టీపీఆర్టీయూ సంఘ సభ్యత్వాలు అందజేస్తున్న భిక్షంగౌడ్

నల్లగొండ రూరల్, జూలై 27: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. శనివారం పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదలచేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాల్సి ఉందని అన్నారు. వీటి సాధనకు ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాదె వెంకట్‌రెడ్డి, శంకరయ్య, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, రామకృష్ణ, చిలకరాజు, దేవయ్య, బూరుగు లింగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

● ఇరువురికి తీవ్ర గాయాలు


వెంకన్న మృతదేహం

కేతేపల్లి, జూలై 27: కేతేపల్లి మండలంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. కేతేపల్లి మండలకేంద్రంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎస్ఐ శివతేజగౌడ్, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

● మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి వెంకన్న (50) అదే గ్రామానికి చెందిన చింత నర్సింహతో కలిసి రోజూ నకిరేకల్ పట్టణంలో తాపీపనికి వెళ్తుంటాడు. శనివారం పనికి వెళ్లిన వెంకన్న, చింత నర్సింహ తిరిగి ఇంటికి బయలుదేరారు. కేతేపల్లిలో డీపాల్ స్కూల్ వద్ద గల జంక్షన్‌లో హైవే రోడ్డు దాటుతుండగా వారి వెనకాల వస్తున్న వ్యాన్ వీరి మోపెడ్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోపెడ్ వెనక కూర్చున్న కందికంటి వెంకన్న అక్కడికక్కడే మృతి చెందగా మోపెడ్ నడుపుతున్న నర్సింహకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శివతేజగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన నర్సింహను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెంకన్నకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.


గాయాలపాలైన చంద్రం

● సూర్యాపేట పట్టణంలోని చంద్రన్నకుంటకు చెందిన శంతం చంద్రం హైదరాబాద్ నుంచి తన ద్విచక్ర వాహనంపై సూర్యాపేటకు వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని నిమ్మలమ్మ చెరువు అండర్‌పాసింగ్ వంతెన మీదకు రాగానే వెనుక నుంచి వస్తున్న మరో వాహనం బైక్ దగ్గరికి వచ్చింది. ఈ క్రమంలో ప్రమాదం తప్పించుకునేందుకు చంద్రం తన వాహనాన్ని రోడ్డు చివరి అంచుకు తీసుకువెళ్లాడు. ఇదే సమయంలో అదుపుతప్పిన బైక్ ఇనుప డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో పట్టుతప్పి తను డివైడర్ మీద నుంచి పక్కకు పడిపోయాడు. బైక్ దానంతట అదే దాదాపు 150అడుగుల దూరం వెళ్లి రోడ్డు మధ్యలో గల డివైడర్‌ను ఢీ కొట్టి పడిపోయింది. ఇనుప డివైడర్‌కు బలంగా తాకడంతో చంద్రం పొట్ట తెగి కడుపులో పేగులు బయటకు రావడంతో పాటు ఎడమ చెయ్యి రెండు చోట్ల విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సర్వీసు సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చంద్రం సూర్యాపేట కోర్టులో విధులు నిర్వహిస్తారని తెలిసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజగౌడ్ తెలిపారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాంమూర్తి

కొండమల్లేపల్లి, జూలై 27: సెంట్రింగ్ సామగ్రిని చోరీ చేసిన వ్యక్తిని కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాంమూర్తి తెలిపారు. కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వైపు నుంచి సెంట్రింగ్ బాక్స్‌లతో కూడిన ఆటో ట్రాలీ కొండమల్లేపల్లి వైపునకు వస్తుండగా గమనించిన పోలీసులు తనిఖీ చేశారు. అదే సమయంలో సైదాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ వద్య చిన్న తప్పించుకునేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఆటో ట్రాలీతో పాటు సుమారు రూ.1.50లక్షల విలువైన సెంట్రింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసును చేధించిన సీఐ ధనుంజయ్య, ఎస్ఐ రాంమూర్తి, హెడ్ కానిస్టేబుల్ జగన్, కానిస్టేబుల్ రాము, భాస్కర్, హేమునాయక్, హోంగార్డు మల్లికార్జున్‌లను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా అంజయ్య


అంజయ్య

చిట్యాలరూరల్, జూలై 27: జాతీయ వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందదదిన బొడిగె అంజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ చైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ నల్లమాస శ్రీకాంత్‌లు అంజయ్యకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలపై జాగ్రత్త వహించాలని, అన్ని పరిశీలించాకే వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. వినియోగదారులకు వారి హక్కుల గురించి అవగాహన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర చైర్మన్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

శాలిగౌరారం, జూలై 27: ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ఆరోగ్యమిత్ర ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేడ గోవర్ధన్ అన్నారు. శాలిగౌరారంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యమిత్రలు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వేతనాలు పెంచి తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: మండలంలోని చిన్నతుమ్మలగూడెం నుంచి చిప్పలపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చొరవ చూపిన ఎమ్మెల్యే వీరేశానికి ఆ రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారే తప్ప బీటీ పనులు కొనసాగించలేదు. దీంతో వర్షాలు కురిసినపుడు ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామానికి చెందిన బండ సాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దాసరి రాజు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు పనుల్లో వేగం పెరగడంతో కృతజ్ఞతలు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: ఆశ్రమాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఫెయిత్ బంజారా ఆశ్రమ చైర్మన్ హన్యానాయక్ అన్నారు. ఆశ్రమంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనాథలు, వృద్ధ దివ్యాంగులకు సాయం అందిస్తే భగవంతుని మెప్పు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సుధారాణి, జనార్ధన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ ఎస్టీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్రకమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు అన్నారు. అధ్యయన యాత్రలో భాగంగా పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, ఆయా భవనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోడిరెక్క మల్లయ్య, సావిత్రి, రుపశ్రీ, పద్మ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని పిట్టంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం ఆయా మేడి కృష్ణమ్మ మృతిచెందగా మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు నివాళులర్పించారు. కృష్ణమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మృతురాలికి రూ.10వేలు పంపించగా సూపర్‌వైజర్ పారిజాత కుటుంబసభ్యులకు అందజేశారు.

శాలిగౌరారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా బడ్జెట్ ప్రవేశ పెట్టలేదని, అన్నివర్గాలు బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ బడ్జెట్ పేద, బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సమావేశంలో నాయకులు షేక్ ఇంతియాజ్, అహ్మద్, కట్టగూరి సురేందర్ రెడ్డి, వలిశెట్టి సైదులు, అయితగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


వీరయ్యను సన్మానిస్తున్న భగవాన్‌నాయక్

తిరుమలగిరి(సాగర్): దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్యను మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ కలిశారు. దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వీరయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన వెంట గిరిజన ప్రజా సమాఖ్య నాయకుడు ఆంగోతు మంగ్యానాయక్ ఉన్నారు.

మర్రిగూడ: ఇందుర్తి మేటిచందాపూర్ గ్రామపంచాయతీలో వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ ఉరిపక్క సరితనగేష్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వీధి దీపాలు లేక రాత్రి సమయంలో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామ ఇన్‌చార్జి శ్రీనివాస్‌కు విన్నవించడంతో పంచాయతీ సెక్రటరీని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

దేవరకొండ: దేవరకొండలో విజిటేరియన్, నాన్ విజిటేరియన్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్ మంజూరైనా స్థలాన్ని సేకరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. మార్కెట్ లేకపోవడం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరలకు కూరగాయలు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు.

దేవరకొండ: రేషన్‌బియ్యం పక్కదారి పట్టిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని డీటీ హన్మంత్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి మండలాల్లో కొంతమంది డీలర్లు రేషన్ బియ్యాన్ని పక్క దారి పట్టిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. వాహనాలను తనిఖీ చేస్తున్నామని, వినియోగదారులకు సక్రమంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని లేనిచో డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు.

మర్రిగూడ: మండలంలోని దామర బీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన రెండో జత యునిఫాంను మండల నోడల్ ఆఫీసర్ బిట్టు శ్రీను, హెచ్ఎం లచ్చిరాం విద్యార్థులకు అందించారు. విద్యార్థులు కచ్చితంగా యునిఫాం ధరించి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని అన్నారు.

చింతపల్లి: మండల కేంద్రానికి కడారి వెంకటయ్య ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడ్డారు. కాలు విరగడంతో అంగవైకల్యం ఉందని సదరం సర్టిఫికెట్ కలెక్టర్ నారాయణరెడ్డికి బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ వినతిపత్రం అందించారు. అతను ఆన్‌లైన్‌లో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల రాలేదని అన్నారు. ఆయన వెంట నాయకులు మోర వెంకటరమణ, రమేష్, గజ్జె అభినవ్‌గౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండరూరల్: జవాన్ ఈరటి మహేష్ మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. మహేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

నార్కట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా మండలంలోని బి.వెల్లెంల గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊశయ్య నేతృత్వంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బి.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో చేరిన హాజరవుతున్న విద్యార్థులు, వివిధ గ్రామాలకు చెందిన వారి తల్లిదండ్రులను సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.